



ఉమ్మడి తూర్పులోని ఐ.పోలవరంలో ఓటు వేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, కపిలేశ్వరపురంలో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు



ఏలూరులో దివ్యాంగురాలైన భార్య చేత ఓటు వేయించి ఎత్తుకుని తీసుకెళ్తున్న భర్త



ఎమ్మెల్సీ పోలింగ్ 69.50%

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జరిగింది. గోదావరి జిల్లాల్లో ఏ ఎన్నికలు వచ్చినా హడావుడే కనిపిస్తుంది. కాని, ప్రచారంలో కనిపించినంత వేగం పోలింగ్ కేంద్రాలకు వచ్చే సరికి చప్పబడింది. 456 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 3,14,984 మంది ఓటర్లకు 2,18,902 మంది ఓట్లు వేశారు. పోలింగ్ శాతం 69.50గా నమోదైంది.

- మందకొడిగా మొదలు..
- పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం
- మధ్యాహ్నానికి తేరుకున్న కూటమి కేడర్
- అప్పటికప్పుడు ఓటర్లను రప్పించిన నేతలు
- ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ
- రాజశేఖర్, వీరరాఘవుల మధ్యేపోటీ
- దొంగ ఓట్లేశారంటూ టీడీపీపై వామపక్షాల ఆరోపణ
- పోలింగ్ కేంద్రాల్లో కలియతిరిగిన కలెక్టర్, ఎస్పీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సాధారణ ఎన్నికల మాదిరే ఈ ఎన్నికల్లో ఓటర్లు తొలి రెండు గంటల్లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు భావించారు. దీనికి భిన్నంగా ఓటర్లలో అలాంటి ఉత్సాహం కనిపించలేదు. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. తొలి రెండు గంటల్లో కేవలం 5.77 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఆరంభంలోనే అనేక పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక వెలవెలబోయాయి. ఉదయం 11 గంటల తర్వాత క్రమేపీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రావడం ఆరంభమైంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఇదే వాతావరణం కనిపించింది. తొలి నాలుగు గంటల్లోనే కేవలం 20 శాతమే నమోదైంది. పోలింగ్ శాతం అతి తక్కువగా ఉండడంతో టీడీపీ వర్గాలు మధ్యాహ్నానికి అప్రమత్తమయ్యాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. స్వేచ్ఛగా ఓటు వేయడంటూ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అతి తక్కువ ఓటర్లున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పోలింగ్ శాతంలో ముందు వరుసలో నిలిచింది. 4,669 మంది ఓటర్లకు 3,637 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.90 శాతం పోలింగ్ నమోదైంది. ఈ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య అత్యల్పమే.

ఏలూరు జిల్లాలో 42,282 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 29,651 మంది ఓటు హక్కును వినియో గించుకున్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పలుచగానే కనిపించారు. నిర్ణీత సమయా నికి ముందుగానే పోలింగ్ కేంద్రాలు ఖాళీ అయ్యాయి. ఉంగుటూరు నియోజక వర్గంలో ఎమ్మెల్యే ధర్మరాజు ఒకవైపు, తెలుగు దేశం జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనే యులు మరోవైపు పోలింగ్ కేంద్రాల వద్దే ఉండి పరిస్థితిని అంచనా వేస్తూ వచ్చారు. పోలవరం నియోజకవర్గంలో ఆది నుంచి ఓటర్ల నుంచి స్పందన కనిపించలేదు. కుక్కునూరు పోలింగ్ కేంద్రంలో దాదాపు 75 శాతం మేరకు పోలింగ్ నమోదు కాగా, వేలేరుపాడులో 81.31 శాతం నమోదు కావడం విశేషం దెందులూరు నియోజక వర్గంలో ఉదయం నుంచే ఓటర్లు ఉత్సా హంగా ముందుకు కదిలారు. చింతలపూడి నియోజకవర్గంలో వివిధ పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే రోషన్ కుమార్ సందర్శించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. ఏలూరు	66	42,282	29,651	70.13
2. పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
3. తూర్పుగోదావరి	92	62,970	42,446	67.41
4. కాకినాడ	98	70,540	47,150	66.84
5. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
6. అల్లూరి సీతారామరాజు	12	4,669	3,637	77.90
మొత్తం	456	3,14,984	2,18,902	69.50

అధికారుల సందర్శన

పోలింగ్ సరళిని పరిశీలించేందుకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శిం చారు. ఏలూరు ఆర్డీవో అంబరీష్‌తో కలిసి నగరంలోని సెయింట్ గ్జేవియర్, అశోక్‌నగర్‌లోని పీడీబీటీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలను పరిశీలించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ సెయింట్ గ్జేవియర్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

పోలింగ్ ఆసాంతం పోటాపోటీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ఒకవైపు మందకొడిగా సాగి నా.. ఇంకోవైపు తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు మధ్య పోటీ హోరా హోరీగా సాగినట్టే కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద తెలుగుదేశం, పీడీఎఫ్ అనుకూలురు ఎక్కడికక్కడ గుమి గూడి ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ పక్షాన ఓటర్లకు ఎరవేసేందుకు ప్రయత్నిం చారంటూ పీడీఎఫ్ అభ్యర్థి మద్దతుదారులు ఆరోపణలు చేశారు. ఎన్నికల నిబంధనలకు పాతరేసి డబ్బులు పంపిణీ చేస్తూ అక్రమా లకు పాల్పడ్డారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. ఎన్నికల శిబిరాల పేరుతో జాతరలా నిర్వహించారని, దొంగ ఓట్లు వేసేందుకు బరి తెగించారంటూ టీడీపీపై ఆరోపణలు చేశారు. జరిగిన అక్రమాలపై ఎన్నికల అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఇంకోవైపు పెదవేగిలో అధికార పార్టీ నేతలు పీడీ ఎఫ్ అభ్యర్థి ఏజెంట్లు, కార్యకర్తలపై దాడికి తెగబడ్డారని వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. ఈ ఘటనపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఓటర్ల స్లిప్పులు ఎక్కడ ?

అధికార యంత్రాంగం గ్రాడ్యుయేట్ ఓటర్ల ఓటర్ల స్లిప్పు ల పంపిణీ సక్రమంగా చేయలేకపోయిం ది. దీంతో ఓటర్ల స్లిప్పుల కోసం పడిగాపు లు, ఎదురుచూపులు తప్పలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, పీడీఎఫ్ నేతలు ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద ఓటర్ స్లిప్పుల ను తీసుకుని వేశారు. కొంత మంది ఎన్ని కల సంఘం ఇచ్చిన వాట్సాప్ నెంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వచ్చి ఓట్లేశారు.

ఓటు వేసిన ప్రముఖులు

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో ఓటు వేసిన ప్రముఖుల్లో భీమవరంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీని వాసవర్మ, పాలకొల్లులో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, భీమ వరంలో శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, ఆకివీడులో డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు, తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి, ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి, పోలవరంలో బాలరాజు, కైకలూరులో కామినేని శ్రీనివాస్ తదితర ప్రముఖులు తమ ఓటును వినియోగించుకున్నారు.



స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బ్యాలెట్లకు పటిష్ఠ భద్రత : కలెక్టర్

ఏలూరు/ ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను పటిష్ఠ భద్రత కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం పరిశీలించారు. సీసీ టీవీ పర్య వేక్షణ కేంద్రాన్ని, కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాటు చేసిన టేబుళ్లను పరిశీలించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వర రావు, ఆర్డీవో అంబరీష్ రమణ, కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలి : ఎస్పీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ గురువారం రాత్రి ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎలక్షన్ బ్యాలెట్ బాక్సులను, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా చర్యలను పరిశీలించారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

• స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా పూర్తికావడంతో, బ్యాలెట్ బాక్సులకు ప్రత్యేకమైన సీళ్లు వేసి, పోలీస్ బందోబస్తు నడుమ ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు రూట్ల వారీగా పీవోలు చేర్చుతున్నారు. వీటిని జిల్లాల వారీగా ప్రాధాన్యతా క్రమంలో 456 పోలింగ్ కేంద్రాల బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఏర్పాటు చేసిన మార్కింగ్ వద్ద బాక్సులు ఉంచి ఆ గదికి సీల్ వేస్తారు. మార్చి 3న జరిగే కౌంటింగ్ వరకు భారీ భద్రతను కల్పిస్తారు. అభ్యర్థుల సమక్షంలో కౌంటింగ్ రోజున బ్యాలెట్ బాక్సులను నియమిత ప్రకారం నిర్దేశించిన టేబుళ్లపై తీసుకొచ్చి 17 రౌండ్ల మేర కౌంటింగ్ చేపడతారు.



ఏలూరు గ్జేవియర్ హైస్కూల్ నుంచి బ్యాలెట్ బాక్సుల తరలింపు

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

(ఆంధ్రజ్యోతి-నూజివీడు)

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ మొదలైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రాల వద్ద ఉన్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 69.92 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున కూటమి నాయకులు, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున కమ్యూనిస్టులు, వైసీపీ నాయకులు తమ అభ్యర్థులను గెలిపించా లని కోరారు. బ్యాలెట్ బాక్సులను గుంటూరుకు తరలించారు.

ఓటేసిన ఎమ్మెల్యేలు



ఎమ్మెల్సీ ఓటేసిన ఏలూరు, పోలవరం, కైకలూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, బాలరాజు, కామినేని



లింగపాలెంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్



గణపవరంలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



గణపవరంలో పోలింగ్ సరళిని పరిశీస్తున్న టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు



గుడివాకలంకలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



• ఏలూరు 12 పంపుల సెంటర్‌లోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో నరసింహారావు పేటకు చెందిన మల్లెమూక నవీన్‌బాబు కుటుంబంలోని ఆరుగురు గ్రాడ్యుయేట్లు కలిసి వచ్చి ఓటేశారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన మంత్రి సారథి

చాట్రాయి : నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం చాట్రాయిలో ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని పరిశీలించారు. గ్రామాల వారీగా మొత్త ఓట్లు, నమోదయిన ఓట్ల వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు.



ఏలూరులోని శ్రీమతి పావాదేవి ధర్మియా థియోసాఫికల్ జూనియర్ కళాశాలలో బ్యాలెట్ బాక్సుకు సీల్ వేస్తున్న సిబ్బంది

మార్చి ఒకటినే పింఛన్

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి) : మార్చి నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మార్చి 1వ తేదీ ఉదయం 7గంటలకు ప్రారంభమవుతాయని, ఏదైనా కారణం చేత తీసుకోని వారికి మార్చి 3న పంపిణీ చేస్తారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో మార్చి నెలలో 2,60,452 మంది పింఛన్‌దారులకు రూ. 112.94 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా దీని నిమిత్తం 5,290 సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేస్తారన్నారు. పింఛన్ దారులకు ఇంటివద్దనే పింఛన్ ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లో 300 మీటర్లు లోపు పంపిణీ చేయాలని, ఏ కారణం చేతనైనా చేయాల్సి వస్తే కారణం యాప్‌లో నమోదు చేయాలన్నారు. పింఛన్ పంపిణీ సమయంలో ఎటువంటి అవినీతి జరిగినా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారికి హుండీల ఆదాయం రూ2.22 కోట్లు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి హుండీలను గురువారం లెక్కిం చగా భారీ ఆదాయం సమకూరింది. కేవ లం 21 రోజుల కాలానికి జరిగిన ఈ లెక్కింపులో నగదురూపేణా రూ.2,22,23, 339 ఆదాయం లభించినట్టు ఆలయ ఇన్ చార్జ్ ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. కానుకల రూపేణా 215 గ్రాము ల బంగారం, 4.085 కేజీల వెండి లభిం చింది. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (5), 1000(21) 2000(1)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

రేపటి నుంచే ఇంటర్ పరీక్షలు

జిల్లాలో మొత్తం 33,511 మంది పరీక్షార్థులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి) : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మార్చి 20వ తేదీ వరకు జరుగుతాయి. 15వ తేదీతో ప్రధాన పరీక్షలు ముగుస్తా యి. జిల్లాలో మొత్తం 55 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యా ర్థు లు 18,453 మంది, ద్వితీయ సంవ త్సరం విద్యా ర్థులు 15, 058 మంది కలిపి మొ త్తం 33,511 మంది దర ఖాస్తు చేసు కున్నారు. ఉద యం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు ఇప్పటికే హాల్‌టిక్కెట్ల పంపిణీ, నిర్వహణ సిబ్బంది నియామకాలు పూర్తయ్యాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా పరీక్షలు జరిగే 640 గదుల్లో మొత్తం 720 సీసీ కెమె రాలను అమర్చారు. వీటిని ఇంటర్ బోర్డు రాష్ట్ర కార్యాలయానికి, జిల్లాలోని ఆర్ఐవో కార్యాలయానికి అనుసంధానం చేశారు. స మస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన వేలే రుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, కలి దిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భీమడోలులోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రత్యేక నిఘా ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి

అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగు నీరు, ఫర్నీచర్, ప్రథమ చికిత్స కేంద్రాలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాం. విద్యార్థులు వాటర్ బాటిల్ తెచ్చుకోవ చ్చు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సమస్య లుంటే తెలిపేందుకు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబరు 08812-230197, ఇంటర్‌బోర్డు కార్యా లయంలో హెల్ప్‌డెస్క్ టోల్‌ఫ్రీ నెంబరు 1800 425 1531తో సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చు.

- కె.యోహాన్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

అన్ని పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీల నిమిత్తం 4 సిట్టింగ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృం దాలు, జిల్లా పరీక్షల కమిటీ (డెక్) సభ్యుల బృందాన్ని నియ మిం చామని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఉద యం 8.30 గం టల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రా ల్లోకి అనుమతి స్తామని, ముందు గానే సంబంధిత కేంద్రాలకు చేరుకోవా లని పరీక్షార్థులకు సూచిం చారు. పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని హెచ్చరించారు.

క్యూఆర్ కోడ్‌తో లీకేజీలకు చెక్

ఇంటర్ పరీక్షల్లో లీకేజీలను సమర్థవం తంగా అరికట్టే చర్యల్లో భాగంగా ప్రశ్న పత్రాలపై క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్‌ను ముద్రిస్తున్నారు. ఎక్కడైనా ప్రశ్నపత్రం లీకైతే సంబంధిత ప్రశ్నపత్రంపై ముద్రించి ఉన్న క్యూఆర్ కోడ్‌ద్వారా ఏ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందో తెలిసిపోతుం ది. దీని ఆధారంగా చర్యలు చేపడతారు. మరోవైపు ప్రశ్నపత్రాల బండిళ్లను కేంద్రా ల్లో తెరిచేటప్పుడు సీసీ కెమెరాల పర్య వేక్షణలోనే ఇంటర్‌బోర్డు మార్గదర్శకాల మేరకు జరగాలని సీఎస్‌లు, డీవోలను ఆదే శించారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినా, మాల్‌ప్రాక్టీస్/మాస్‌కాపీయింగ్ జరిగినట్టుగా తనిఖీల్లో రుజువైతే చట్టప్ర కారం చర్యలు తీసుకుంటారు. ఇంటర్ బోర్డు సరఫరా చేసిన బేసిక్ మొబైల్ ఫోన్ చీఫ్ సూపరింటెండెంట్ వద్ద తప్ప ఇంకె వరి వద్దనైనా ఫోన్ ఉంటే వారిపై క్రిమి నల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఇంటర్ విద్యను బోధిస్తు న్న 26 జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌ల నుంచి ప్రథమ సంవత్సరం బాలబాలికలు 437 మంది, ద్వితీయ సంవత్సరం 192 మంది కలిపి మొత్తం 629 మంది థియరీ పరీక్షలకు హాజరవుతున్నారు.

వెబ్‌సైట్లో 'ఓపెన్' ఇంటర్ పరీక్షార్థుల హాల్‌టిక్కెట్లు

మార్చి 3 నుంచి 15 వరకు జరగ నున్న ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యా ర్థుల హాల్‌టిక్కెట్లు ఏపీ ఓపెన్ స్కూల్. ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందుపరి చినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలి పారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను సం బంధిత వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ లేదా ఓపెన్‌స్కూల్స్ అధీకృత స్టడీసెంటర్ల కో-ఆర్డినేటర్ల నుంచి తీసుకోవచ్చని వివరించారు.

ఇచ్చిపుచ్చుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నెలకోసారి సమావేశమై.. పరిస్థితిని సమీక్షించుకుందాం' అని చైర్ ఈ సందర్భంగా సలహా ఇచ్చారు. వరద సమయంలోనూ పోతిరెడ్డిపాడు నుంచి నీటిని ఏపీ వాడుకుందని.. కేసీ కెనాల్ ద్వారా కూడా నీటిని వాడుకుందని గతంలో చేసిన ఆరోపణలనే తెలంగాణ ప్రస్తావించింది. నాగార్జున సాగర్ నుంచీ వాడేసుకుందని తెలిపింది. ఈ వాదనలను ఏపీ తీవ్రంగా ఖండించింది. వరద నీరు సముద్రంలోకి వెళ్తుంటే రాష్ట్రావసరాలకు వాడుకున్నామని పునరుద్ఘాటించింది. పోతిరెడ్డి పాడు నుంచి నీటిని తీసుకున్నా.. ఆ తర్వాత పై నుంచి వచ్చిన వరద కారణంగా శ్రీశైలం జలాశయం నిండినందున.. 20 టీఎంసీల నష్టం వాటిల్లిందన్న వాదనలోనూ పస లేదంది. శ్రీశైలం, సాగర్‌లలో విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటిని వదిలి సముద్రంపాలు చేసింది తెలంగాణేనని ఆక్షేపించింది. దీంతో చైర్మన్ జోక్యం చేసుకుని.. గతంలో జరిగినవి ఇప్పుడు అప్రస్తుతమన్నారు. ప్రస్తుతం సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఏపీకి వదులుతున్న ఏడు వేల క్యూసెక్కులు.. తెలంగాణ కోసం వదులుతున్న తొమ్మిది టీఎంసీలు.. పంటలను కాపాడుకోవడానికి సరిపోతాయో లేదో ఈఎన్‌సీల స్థాయిలో చర్చించుకోవాలన్నారు. ఉన్న నీటిని పంటలకు సర్దుకోవడం.. తాగునీటి అవసరాలు తీర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, హంద్రీ-నీవా నీటినీ సమీక్షించుకోవాలని సూచించారు. నెల తర్వాత కార్యదర్శుల స్థాయిలో మాట్లాడుకుని.. అవసరాలకు అనుగుణంగా సాగర్‌లో అందుబాటులో ఉన్న జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వాడుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాల నీటిల కమిటీ జూన్ వరకు ఏపీకి 55, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమంటూ ఇచ్చిన నివేదిక పైనా చర్చించారు. అనంతరం చైర్మన్ సూచన మేరకు ఈఎన్‌సీలు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్ సమావేశమై సుహృద్భావ వాతావరణంలో చర్చించుకున్నారు. పంటల రక్షణకు సాగర్ కుడి కాలువ నుంచి 7 వేల నుంచి 8 వేల క్యూసెక్కులు.. ఎడమ కాలువ నుంచి 7 వేల క్యూసెక్కులను వాడుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలం జలాల వాడకంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చేందుకు అంగీకరించారు.

సీలేరు జలవిద్యుత్ కేంద్రం



100 రోజులు.. 1,596 మి. యూనిట్లు

» రికార్డు స్థాయిలో కృష్ణపట్నం మూడో యూనిట్ ఉత్పత్తి

» ఒక్కరోజే 4.949 మిలియన్ యూనిట్లు

» అద్భుతం సృష్టించిన సీలేరు జల కేంద్రం

అమరావతి, సీలేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు రికార్డు స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం మూడో యూనిట్‌లో వంద రోజులుగా నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతూ 1596.30 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించింది. ఇక.. సీలేరు జల విద్యుత్ కేంద్రం 24 గంటల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో 4.949 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసింది. ఇది ఈ కేంద్రం చరిత్రలోనే ఆల్ టైమ్ రికార్డు. ఆ వివరాలను జెన్కో గురువారం వెల్లడించింది. వేసవిలో విద్యుత్తు కొరత రానీయకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు వెల్లడించారు. జెన్కో విద్యుత్తు కేంద్రాలు 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా సగటున 110 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన 123 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం నుంచి తొలిసారిగా 95 మిలియన్ యూనిట్లను ఈ నెల 18న ఉత్పత్తి చేశామని తెలిపారు.

నెలరోజుల ముందుగానే లక్ష్యఛేదన

సీలేరు జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిందని జెన్కో ఈఈ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం 477 మిలియన్ యూనిట్లకు గాను గురువారం (27వ తేదీ) ఉదయం నాటికి 477.644 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం ఇంజనీర్లను, సిబ్బందిని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈలు (ఓ అండ్ ఎం) చిన్న కామేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

కరెంటు కొనుగోలు బకాయి 6,556 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు బకాయిలు రూ.6,556.25 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో గత నెల బకాయిలు రూ.1,873. కోట్లు దానికిముందు రెండు నెలల బకాయిలు రూ.4,653.24 కోట్లు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'ప్రాప్తి' పోర్టల్ వెల్లడించింది. తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని ఏపీపీసీసీని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కోరింది.

డిస్కమ్‌ల బలోపేతానికి సహకారం అందించండి

» సీమలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయండి

» కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం నిరంతరం కావాల్సిందేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గురువారం రాష్ట్రాల ఇంధన శాఖల కార్యదర్శులు, మంత్రులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్న గొట్టిపాటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రాయలసీమలో సోలార్, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే కరెంటును రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర సహకారాన్ని కోరగా, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశంలో కార్యాచరణను ప్రకటిస్తామని ఖట్టర్ వెల్లడించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెట్రోను అందిస్తున్న సితార



విభిన్న పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న తమిళ హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో'. మే ఒకటిన విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఒకవైపు వరుసగా సినిమాలు నిర్మిస్తూ భారీ విజయాలను అందుకుంటున్న ఈ సంస్థ మరో వైపు పంపిణీరంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో పండగ చేసుకొనేలా 'రెట్రో' విడుదలకు ఈ సంస్థ ప్లాన్ చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న 'రెట్రో'లో పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలో 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'రెట్రో' చిత్రానికి సంబంధించి ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జూన్‌లో వస్తున్న కుబేరుడు



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. ఈ ఏడాది జూన్ 20న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పోస్టర్‌లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా నిలబడి ఒకరిని మరొకరు తీక్షణంగా చూస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది.

విష్ణు నమ్మకమే శివుడి పాత్ర చేయించింది

-అక్షయ్ కుమార్



'శివుడి పాత్ర చేయాలంటూ ఆఫర్ వచ్చినప్పుడు నేను రెండు సార్లు తిరస్కరించాను. కానీ విష్ణు వదల్లేదు. భారతీయ సినీ ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను' అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నాతో ఆ పాత్ర చేయించింది. కన్నప్ప కథ చాలా శక్తిమంతమైంది. విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో నేనూ భాగమవడం గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. డాక్టర్ మోహన్‌బాబు తన తనయుడు విష్ణు మంచుతో ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో నిర్మించిన 'కన్నప్ప' టీజర్‌ను ముంబైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌కుమార్ మాట్లాడారు. హీరో విష్ణు మాట్లాడుతూ 'కన్నప్ప కేవలం నాకు ఓ సినిమా కాదు.. నా జీవన ప్రయాణం. కన్నప్ప కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం ఆనందంగా ఉంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకొన్న టీజర్‌ను మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 25న 'కన్నప్ప' విడుదలవుతుంది' అని చెప్పారు.



పూజా హెగ్డే ప్రత్యేక గీతం

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే నటిస్తున్నారు. ఆమె లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. బుధవారం 'ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి' అంటూ ఓ ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ పోస్టర్ పూజా హెగ్డేదే నంటూ ప్రకటించింది. అయితే, ఈ మూవీలో పూజా హెగ్డే కీలక పాత్రను పోషిస్తున్నారా? లేక స్పెషల్ సాంగ్‌లో నర్తిస్తున్నారా? అనేది తెలియాల్సివుంది. 'జైలర్' సినిమాలో హీరోయిన్ తమన్నా 'కావాలయ్యా' పాట తరహాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ గీతంలో నర్తించేందుకు పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లు అభిమానులు భావిస్తున్నారు. ఈ మూవీలో ఆమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఇది పైసా వసూల్ సినిమా

- సందీప్ కిషన్



'మజాకా' చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇది పైసా వసూల్ సినిమా. అందరూ థియేటర్లలోనే చూడండి' అని హీరో సందీప్ కిషన్ కోరారు. ఆయన కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన 'మజాకా' చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. త్రినాథరావు మాట్లాడుతూ 'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం సక్సెస్ అయ్యాం అనిపించింది' అని తెలిపారు.

ఆస్ట్రేలియాలో షూట్ చేశాం

- విరాజ్ రెడ్డి



విరాజ్‌రెడ్డి చీలం కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గార్డ్'. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా విరాజ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ అంతా ఆస్ట్రేలియాలో చేశాం. ఒక సెక్యూరిటీ గార్డ్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా సినిమా ఉండబోతోంది. కథానుసారం అన్ని రకాల ఎమోషన్స్ పలికించడం నటుడిగా నాకు సవాల్ అనిపించింది" అని చెప్పారు.



అప్‌డేట్స్

ఆ వాహనం కథేంటి?



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వి మేఘన, నిహల్ కోధాటి ముఖ్య తారలుగా సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 21న విడుదల కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. ఇందులో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనం ప్రేమలో పడిపోతారు. యువతరానికి నచ్చే అంశాలతోపాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు.

తెలుగు తెరకు కొత్త గ్లామర్



టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. 'సర్కార్ నౌకరి ఫేమ్', గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ దర్శకత్వంలో తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తాటి బాలకృష్ణ నిర్మిస్తున్న చిత్రంలో భైరవి కథానాయికగా పరిచయం అవుతున్నారు. 'ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం ఇది' అని నిర్మాత తాటి బాలకృష్ణ తెలిపారు.

నేర పరిశోధన నేపథ్యంలో



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'అబ్సెషన్'. రాకేశ్ శ్రీపాద దర్శకత్వంలో రవి నాలమ్ నిర్మిస్తున్నారు. గురువారం కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ చేతుల మీదుగా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హరీశ్ వినయ్, వి. ధీరజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనీశ్ రాజ్ దేశ్‌ముఖ్, సినిమాటోగ్రఫీ: వనిధర్‌రెడ్డి





• **సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం**

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఉంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను నెరవేర్చే దిశగా ఈసారి బడ్జెట్ ఉంటుందని భావిస్తున్నాం. దెందులూరు నియోజకవర్గం ఎన్నడూలేని విధంగా అభివృద్ధి సాధించే దిశగా ప్రతిపాదనలు చేశాం. ఆరునెలల కాలంలోనే నిజమైన అభివృద్ధిని ప్రజలు రుచిచూశారు. ఉపాధి కల్పన దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోంది.

• **పంపిన ప్రతిపాదనలపై చర్చిస్తా**

బడేటి చంటి , ఏలూరు ఎమ్మెల్యే



పోలవరం ప్రాజెక్టుకు అధిక కేటాయింపులు ఉండే అవకాశం ఉంది. ఏలూరు నియోజకవర్గంలో శని వారపుపేటలోని కాజ్వేపై బ్రిడ్జి నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులపై ప్రతి పాదనలు పంపాం. టిడ్కో గృహాలు పూర్తిచేయడానికి,తమ్మిలేరు రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరాం. మేము పంపిన ప్రతిపాదనలు బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తాం.

• **వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు**

ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే



నియోజకవర్గంలో రహదారులు, సాగునీరు, పరిశ్రమల ఏర్పాటుపై నిధులు కేటాయింపు ఉంటుందని భావిస్తున్నాం. వీటిపై అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తాను. ఉంగుటూరు నియోజకవర్గంలోని బొబ్బిలి, నారాయణపురం వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనల పంపాం. నియోజకవర్గంలో ప్రధానంగా డ్రైన్ల నిర్మాణం తోపాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తాను. నియోజకవర్గంలో ప్రభుత్వం అంద జేసిన స్థలాల్లో, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం మంజూరుకు కృషి చేస్తా.

• **కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై దృష్టి**

కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే



సాగు, తాగునీరు సరఫరాకు వేసవిలోని పంటకాలువల, ముురుగు కాలువల అభివృద్ధికి, ఆక్వారంగానికి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని భావిస్తున్నా. ఇప్పటికే పలు అంశాలపై ప్రభుత్వానికి ప్రతి పాదనలు అందజేశాం. అవకాశాన్ని బట్టి పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు మేలు జరిగేలా చూస్తాను.

నేడు అసెంబ్లీలో వార్షిక బడ్జెట్. ఈసారైనా ఉమ్మడి జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు సంతృప్తికరంగా ఉంటాయన్న ఆశలేకపోలేదు. గత బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతలు, కాలువల ఆధునికీకరణకు కొంతమేర నిధులు కేటాయించారు. ఈసారి వీటితోపాటు మరిన్ని విభాగాలకు కేటాయింపులు సంతృప్తికరంగా ఉండేలా జాగ్రత్త పడబోతున్నారనే ఆశ అందరిలోనూ ఉంది. సాగునీటితో పాటు తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయం, అనుబంధ రంగాలు, పంటలకు బోనస్, ఊరటనిచ్చేలా ప్రోత్సాహకాలు, ఆక్వా రంగానికి చేయూత, కొల్లేరుకు మరింత ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్ ఉండబోతుందా అనేదే అందరిలోనూ ఉత్కంఠ.



నిండుగా నిధులిస్తారా..

అసెంబ్లీలో నేడు వార్షిక బడ్జెట్

అందరిచూపు.. ఆ దిశగానే

పోలవరంతోపాటు ఎత్తిపోతల కోసం ఎదురుచూపులు

ఆధునికీకరణ,కొల్లేరు రెగ్యులేటర్లపైనా ఆశలు


ఆక్వాను ఆదుకోండంటూ ఇప్పటికే డిమాండ్

ఎమ్మెల్యేలు ఇదే బాటలోనే..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఈసారి మెరుపులు మెరిపిస్తారా, లేక నీరుగారుస్తారా అనే తర్జనభర్జన సాగుతోంది. అసెంబ్లీలో వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశ పెడుతున్నారు. ఇంతకు ముందు అనేక రంగాలు, వ్యవస్థలు కుప్పకూలిన స్థితిలో ఉండగా క్రమేపీ ఆయా రంగాలను తిరిగి పునర్నిర్మిస్తూ వస్తున్నారు.ఈ క్రమంలోనే ఈసారి వార్షిక బడ్జెట్‌లో అందరినీ సంతృప్తిపరిచేలా కేటాయింపులు ఉండబోతున్నాయని భావిస్తున్నారు. ప్రత్యేకించి పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన నిర్మించేందుకు వీలుగా గత వార్షిక బడ్జెట్‌లో 4 వేల 873 కోట్లు కేటాయించారు. ఈ క్రమంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు పుంజుకున్నాయి. ఇంకోవైపు పోలవరం నిర్వాసిత కుటుంబాలకు 900 కోట్లకుపైగా ఈ మధ్యనే సాయం అందించారు. గడిచిన ఐదేళ్లుగా నయాపైసా పైసా అందని స్థితిలో పోలవరం నిర్వాసిత కుటుంబాలు బావురమంటుండగా వారిని ఓదార్చేలా కూటమి ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే పరిహారం చేరేలా చూసింది. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లో ముంపు గ్రామాల్లో ఉన్న వారంతా ఈ చర్యతో కాస్త తేరుకోగలిగారు. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు భారీ కేటాయింపులు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమకు చెందిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు జల వనరుల మంత్రిగా ఉన్నారు.ఈ నేపథ్యంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు మిగతా పథకాలకు తగినన్ని నిధులు లభిస్తాయన్న ఆశ, ఆత్రుత అందరిలోనూ కనిపిస్తున్నాయి.

ఎత్తిపోతలకు కాస్తంత ఎక్కువగానే..



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్న తపనతో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీంతోపాటు ప్రధాన ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయబోతున్నట్టు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రకటించింది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండు దశలుగా విభజించి పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే చింతలపూడి ఎత్తిపోతలకు గత వార్షిక బడ్జెట్‌లో 150 కోట్లు కేటాయించారు. అయితే అప్పట్లో ఇది ఏమాత్రం ఎత్తిపోతల పనులు చేపట్టడానికి సరిపోదని, కాంట్రాక్టు ఏజెన్సీలకు బకాయిలు చెల్లించడానికే సరి పోతుందన్న వ్యాఖ్యలు వినిపించాయి. దాదాపు 3 వేల 782 కోట్ల వ్యయంతో చింతలపూడి ఎత్తిపోతలను పూర్తిచేయా లంటే ఆ మేరకు ఈ ఏడాది ఆసాంతం తగినన్ని నిధులు కేటాయించాల్సిందే. ఈ వార్షిక బడ్జెట్‌లో చింతలపూడి ఎత్తిపోతల మొదటి దశకు మోక్షం లభించేలా చూస్తారని ఆశ అందరిలోనూ ఉంది. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సైతం ఈ ఎత్తిపోతలను పూర్తి చేయాలనే డిమాండ్‌తోనే ఉన్నారు. దీనికితోడు తాడిపూడి ఎత్తిపోతల పథకానికి తగినన్ని నిధులు కేటాయిస్తే దాదాపు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు సాఫీగా అందుతుంది. కేవలం పిల్ల కాలువలు నిర్మించేందుకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం వల్లే ఇప్పటిదాకా పూర్తి స్థాయి లక్ష్యాలను అందుకోలేకపోతున్నారు.

ఆధునికీకరణకు ఆదుకుంటారా..



పంట కాలువలను ఆధునికీకరణకు 20 ఏళ్ల క్రితమే సరికొత్త కార్యాచరణ చేపట్టగా ఇప్పటిదాకా ఆ లక్ష్యాలను అందుకోలేక పోయారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం మాత్రం ప్రతీ వార్షిక బడ్జెట్‌లోను తగినన్ని నిధులు కేటాయిస్తూ వచ్చింది. కొంతమేర పనుల్లో పురోగతి సాధించగలిగింది. కానీ 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం మాత్రం ఆధునికీకరణ పనులను విస్మరించింది. ఉభయగోదావరి జిల్లాల్లో గత వార్షిక బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ఆధునికీకరణ పనుల సుమారు 50 కోట్లు కేటాయించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చేసరికి 20 కోట్ల మేర కోటాగా నిర్ణయించారు. ఈసారి వార్షిక బడ్జెట్‌లో పనులు పూర్తి చేసేలా నిధులు కేటాయించాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొల్లేరు సంగతేంటి..



కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి వీలుగా గతంలోనే ప్రణాళిక రూపొందించారు. కానీ గత వార్షిక బడ్జెట్‌లో వీటి నిర్మాణానికి అనువుగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. రెగ్యులేటర్ల నిర్మాణం కారణంగా ఒకవైపు కొల్లేరులోకి ఉప్పునీటి సాంద్రత చేరకుండా చూడడం, రెండోవైపు మత్స్యకార కుటుంబాల్లో సంప్రదాయ వేటకు అనుగుణంగా కొల్లేరును తీర్చిదిద్దడం వంటి అనేక లక్ష్యాలు ఉన్నాయి. ఈసారి వార్షిక బడ్జెట్‌లోనైనా రెగ్యులేటర్ల నిర్మాణానికి అనువుగా నిధులు కేటాయించాలని గట్టిగానే పట్టుపడుతున్నారు. దీని నిర్మాణ ఆవశ్యకతను ఇప్పటికే పదేపదే ప్రజాప్రతినిధులు బహిరంగ వేదికలపై చెబుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ఈ మేరకు వార్షిక బడ్జెట్‌లో సరైన కేటాయింపులే చేస్తుందన్న ధీమాతో ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఆక్వాకు ఊపిరి పోస్తారా ?

ఆక్వా రంగానికి ఊపిరి పోసే విధంగా బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించకపోతారా అనే ఆశతోనే ఆక్వాను నమ్ముకున్న రైతులు ఉన్నారు. ఇప్పటికే వరుస వైరస్‌లు రైతులను దెబ్బ తీస్తుండగా మార్కెట్ ఒడిదుడుకులు వీరిని నష్టాల పాలుచేస్తూ వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్ల ఆక్వా కోలుకోలేనంతగా దెబ్బతింది. దీంతో ఈసారైనా కూటమి ప్రభుత్వం ఆక్వాకు అవసరమైన విద్యుత్ అవసరాలతో పాటు మార్కెట్ సౌకర్యాలను మెరుగుపర్చాలన్న డిమాండ్ తెరమీదకు వచ్చింది.

ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట !

ఈ వార్షిక బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట వేస్తారని అందరూ భావిస్తున్నారు. దీనికనుగుణంగానే కేటాయింపులు ఉండబోతున్నాయని ఊహిస్తున్నారు. ఈ మేరకు అన్ని వర్గాలు కూటమి బడ్జెట్‌పైనే ఆశగా ఎదురుచూస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా కేటాయింపులు ఉండాలని, బోనస్‌తో పాటు రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల్లో పెరుగుదల ఉండా లని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా సరికొత్తగా నిధులు కేటాయించాలన్న డిమాండ్ వినపడుతోంది.

• **ప్రతీ ఇంటికి గోదావరి జలాలు**

పితాని సత్యనారాయణ, ఆచంట ఎమ్మెల్యే



ఆచంట నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా గోదావరి జలాలను అందించేలా ప్రతిపాదనలు పంపాం. నియోజకవర్గంలో కొన్ని కాలనీలను పైలట్ ప్రాజెక్టులుగా తీసుకుని అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నాం. జిల్లా కోనసీమ జిల్లాను కలుపుతూ కోడేరు నుంచి గన్నవరం వరకు వారధి నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని గోదావరి పరివాహక ప్రాంతాలను అతి సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు పుష్కర ఘాట్‌లు, పలు ఆలయాల అభివృద్ధికి, ఏటిగట్టును పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

• **ఆధునికీకరణ నిధులు కేటాయించాలి**

ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే



బడ్జెట్ సమావేశంలో ప్రజల అభిమతం మేరకు సూపర్ సిక్స్ పథకాలకు కేటాయింపులు చేయాలి. తల్లికి వందనంతోపాటు, ప్రధానంగా మౌలిక సదుపాయాలు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి, తాగునీరు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువయ్యే జలజీవన్ మిషన్ నిధులు ప్రకటించాలి. డెల్టా ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించాలి.

• **రహదారుల కోసం రూ.12 కోట్లతో ప్రతిపాదనలు**

బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే



నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం రూ.12 కోట్లకు ప్రతి పాదనలను పంపించాం. ఇప్పటికే పెంటపాడు మండలం బోడపాడు రహదారి కోసం రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. రూరల్ మండలం జగన్నాథపురం నుంచి మాధవరం వరకూ రూ.87 లక్షలు మంజూరయ్యాయి. బడ్జెట్ సమావేశాలను బట్టి నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాం.

• **నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తా**

బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎమ్మెల్యే



దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హార్బర్, తాగునీటి సమస్య, ఆక్వా యూనివర్సిటీ పనుల వేగవంతం, వియర్ ఛానల్‌తదితర సమస్యలను సభ దృష్టికి తీసుకు వెళతా. వేసవి వస్తే తీర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. దీన్ని శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. పట్టణంలో పైప్‌లైన్లు మెరుగుపర్చాలి. కలుషిత నీటిని అరికట్టి స్వచ్ఛమైన నీరు అందిస్తామని హామీ ఇచ్చాం. దాన్ని సభ దృష్టికి తీసుకెళ్లి నిధులకు కృషి చేస్తా.



కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయం

రేపటి నుంచి కొల్లేరు పెద్దింటమ్మ జాతర

కైకలూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట పెద్దింటమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. మార్చి ఒకటో తేదీ నుంచి 13 వరకు జరుగుతాయి. 10న జలదుర్గమ్మకు గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామికి కల్యాణ మహోత్సవం జరిపిస్తారు. చివరిరోజు 13న ఆలయ కోనేరు లో తెప్పోత్సవం జరుపుతారు. జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, మంచినీరు, చలువ పందిర్లు, విద్యుద్దీపాలంకరణ, వైద్య శిబిరాలు ఏర్పాట్లు పూర్తిచేశారు. పెద్దింటమ్మ తొమ్మిదడుగులు ఎత్తు కలిగి విశాల నేత్రాలతో పద్మాసన భంగిమలో ఉన్న పార్వతీదేవీ ప్రతిరూపం. అమ్మవారిని ఇక్కడ మత్స్యకారులు కులదైవంగా కొలుస్తారు. వీరంతా పూర్వం ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొల్లేరు సరస్సు చుట్టూ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఇక్కడ వడ్డెర కులస్థులే కాకుండా అసోం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.



కనుల పండువగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

ముసునూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):బలివే రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండవగా నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. బుధవారం రాత్రి 11.30 గంటలకు వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం తాతగుడికి ఊరేగింపుగా వెళ్లి స్వామివారు ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారికి ఉదయం తీర్థబిందె, హోమం, బలిహరణ, సాయంత్రం హోమం, బలిహరణ, మహాకుంభం, రాత్రి 10 గంటల నుంచి పురవీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించారు.



రావణబ్రహ్మ వాహనంపై క్షీరారాముని ఊరేగింపు





రథంలో స్వామివారు...రథోత్సవంలో భక్తజన సందోహం

శోభాయమానం.. సోమేశ్వరుని రథోత్సవం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గునుపూడి సోమేశ్వరస్వామి రథోత్సవం శోభాయమానంగా సాగింది. గురువారం తెల్లవారుజామున పార్వతీ పరమేశ్వరులకు వైభవంగా కల్యాణం నిర్వహించిన అనంతరం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. భక్తులు మొక్కులుగా కట్టిన అరటిపండ్ల గెలలతో ముస్తాబైన రథంపై క్షేత్రపాలకుడైన జనార్దనస్వామి వెంటరాగా కల్యాణ మూర్తులైన పార్వతీ పరమేశ్వరులను మేళతాళాలతో ఊరేగారు. ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ, కందుకూరి సోంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కొబ్బరి కాయ కొట్టారు. ప్రత్యేక హారతులు ఇచ్చిన అనంతరం భక్తులు ఒకసారిగా శివ నామ స్మరణ చేస్తు రథాన్ని లాగారు. అక్కడ నుంచి ఎటువంటి ఆటంకాలు లేకుండా నాచువారి సెంటర్ వరకు దాదాపు 2 గంటలపాటు రథో త్సవం సాగింది. డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేసారు. ఎండోమెంట్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో రామకృష్ణరాజు పర్యవేక్షించారు.

ఊరేగింపులో అపశ్రుతి

సోమేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం మధ్యాహ్నం అపశ్రుతి చోటు చేసుకుంది కల్యాణోత్సవం కోసం వేసిన తాటాకు పందిరి అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న ప్రజలు పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తం అవడంతో మంటలను వెంటనే అదుపులోకి తెచ్చారు. రథోత్సవం సందర్భంగా బాణాసంచా కాల్చారు. ఒక జువ్వ గాలిగోపురం వద్ద ఉన్న తాటాకు పందిరిపై పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో రథోత్సవం సాగుతున్నంత సేపు బాణసంచా కాల్చడం నిలిపివేశారు.



బాణసంచా పండి అంటుకున్న తాటాకు పందిరి

రావణబ్రహ్మ వాహనంలో ఊరేగిన క్షీరా రామలింగేశ్వరస్వామి

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్షీరా రామ లింగేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లను గురువారం సాయంత్రం రావణాబ్రహ్మ వాహనంపై ఊరేగించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో దగ్గులూరుకు చెందిన వరదా సోమేశ్వరరావు, రామకోటి దంపతులు నేసిన 18 అడుగుల వెడల్పు, 360 మూరల పొడవు కలిగిన మల్లన్నపాగాను స్వామివారి ఆలయ శిఖరం నుంచి గాలి గోపురానికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈవిధంగా శ్రీశైలం లోనూ, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామివార్ల ఆలయాల్లో మాత్రమే ప్రత్యేకంగా అలంకరించే ఆచారం ఉంది. గురువారం స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.గ్రామోత్సవానికి ముందు కుంభం పోశారు.

బలివే తమ్మిలేరులో మరొకరి మృతి



రాంబాబు (ఫైల్)

ముసునూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి స్నానఘట్టం దగ్గర ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన విషయం మరువక ముందే గురువారం మరొకరు మృతి చెందారు. ముసునూరు మండలం అక్కి రెడ్డిగూడెంకు చెందిన హెచ్చు రాంబాబు (28) స్వామివారి దర్శనం అనంతరం సాయంత్రం తమ్మిలేరులో స్నానానికి దిగి నీటిలో మునిగిపోయాడు. స్థానికులు స్పందించి అతడికి వెలికితీయగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. తమ్మిలేరులో ప్రమాదాలు జరుగకుండా రక్షణగా కర్రలను ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారని పలువురు మండిపడుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఉండి రోడ్డులో ఉన్న ఒక ఆసుపత్రిలో మెడికల్ షాపులో పనిచేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. టూటౌన్ సీఐ కాళీచరణ్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన ఖండవల్లి శ్రీనివాసరావు (28) మూడేళ్లుగా ఆసుపత్రిలో మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఆకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోవడంతో వైద్యులు పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అయితే మృతుడు శ్రీనివాసరావు సోదరుడైన ఖండవల్లి శివదుర్గారావు మాత్రం వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన సోదరుడు మృతి చెందాడని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు ఆపరేషన్ చేసే ముందు ఇచ్చే మత్తు ఇంజెక్షన్ వాడాడని అది డోస్ ఎక్కువ అవడం వల్ల మృతి చెందాడా లేక మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో కూరుకుపోయిన మృతదేహాలు లభ్యం



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చెరువులోని ఊబిలో మునిగి పోయిన బాబాయి, అబ్బాయి మృతదేహాలు గురువారం ఉదయం తేలడంతో రెస్క్యూటీమ్ వాటిని బయటకు తీశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన జిజ్జువరపు వెంకటేశ్వరరావు (50) ఈనెల 26వ తేదీ సాయంత్రం ఆ గ్రామంలోని చెరువులో స్నానం చేయడానికి దిగగా ఊబిలో కూరుకుపోతూ కేకలు వేయడంతో అతని తమ్ముడి కుమారుడు సుబ్రహ్మణ్యం (30) కాపా డేందుకు నీటిలో దిగాడు. ఇతను కూడా ఊబిలో కూరుకుపోతూ కేకలు వేశాడు. అయితే గట్టుపై ఉన్నవారు భయంతో కాపాడలేకపోయారు.పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బుధవారం సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా మృత దేహాలు లభ్యం కాలేదు. గురువారం ఉదయం రెండు మృతదేహాలు నీటిలో తేలడంతో రెస్క్యూ టీమ్ బయటకు తీసుకువచ్చారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహాలను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

డయాలసిస్ బాధ తట్టుకోలేక ఆత్మహత్య

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):డయాలసిస్ బాధను తట్టుకోలేని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమలంపాలెంకు చెందిన భీమడోలు నాగేశ్వరరావు(62) ఏడాది కాలంగా మూత్రపిండాల సమస్యతో బాధపడు తూ డయాలసిస్ చేయించు కుంటున్నాడు. డయా లసిస్‌ను తట్టుకోలేక ఈ నెల 25న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి విజయవాడ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సంఘ ఎన్నికలు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా ట్రెజరీ, ఏలూరు ప్రాంగణంలో మార్చి 2న జరుగుతాయని రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కృష్ణంరాజు గురువారం తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ హసీనాబేగం, సహాయ ఎన్నికల అధికారిగా షేక్ ఫయాజ్ అహ్మద్, ఎన్నికల పరిశీలకురాలిగా జె.కరుణ వ్యవహరిస్తారని తెలిపారు. ఏలూరు జిల్లాలోని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.


ఏలూరు గాంధీనగర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద రెడ్డి అప్పలనాయుడు


ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ప్రశాంతం

ఉదయం 11 గంటల వరకు మందకొడిగా ఎమ్మెల్సీ ఓటింగ్ సరళి
పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యేల పర్యవేక్షణ
చంటి పిల్లలతో తరలివచ్చిన తల్లులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఏలూరు జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రా రంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు వరకు జరిగింది. ఉదయం 11 గంటల వరకు పోలింగ్ మందకొ డిగా సాగింది. కొన్ని చోట్ల సాయంత్రం నాలుగు గంటల తరువాత పోలింగ్ కేంద్రాల వద్దకు పట్టభద్రులు చేరుకున్నా సమయం లేక వెనక్కి తిరిగివెళ్లారు.ఏలూరు రూరల్ మండలంలో 70.28 పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ వి.శ్రీని వాసరావు తెలిపారు. రూరల్ మండలంలో 735 ఓటర్లకు గానూ 518 మంది తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, గుడి వాకలంకలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రక్రియను ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని అన్నారు.

● దెందులూరు మండలంలో పట్టభద్రుల ఓటర్లు 2,199 మంది ఉండగా మూడు పోలింగ్ కేంద్రాల్లో 1638 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దెందులూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలు, బాలికల ఉన్నత పాఠశాలల్లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే ఎన్నికలను ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, దెందులూరు తహసీల్దార్ సుమలత పరిశీలించారు.

● నిడమర్రు మండలంలో 946 పట్టభద్రుల ఓటర్లకు గానూ 685 ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో సాయంత్రం 4 గంటలకు ఎన్నికలు ముగిసే సమయానికి 72.41 శాతంగా నమోదైనట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. 946 మంది ఓటర్లలో పురుషులు 581 మంది, స్త్రీలు 365 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● టి.నరసాపురం మండలంలో మొత్తం 918 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా రెండు బూత్‌లలో కలిపి 634 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు బూత్‌లలో పురుషులు 454, స్త్రీలు 180 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 69.06 శాతంగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.ఎస్. సాయిబాబా తెలిపారు.

● ఉంగుటూరు మండలంలోని మూడు పోలింగ్ బూత్‌లలో 1630 ఓటర్లకు గాను 1231 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల జోనల్ అధికారి పోతురాజు వివరించారు.


● బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండగా ఓటు వేయడానికి యువ దంపతులు తమ చిన్నారిని ద్విచక్ర వాహనంపై వదిలివెళ్లారు. చిన్నారి తల్లికి ఓటు హక్కు ఉండటంతో భర్తకు అప్పగించి వెళ్లింది. అదే సమయంలో భర్త స్నేహితులు కనిపించడంతో చిన్నారిని ఇలా బైక్ ట్యాంకుపై నిద్రపుచ్చి వెళ్లాడు. అయితే ఆ చిన్నారి నిద్రలో కిందపడితే ఏమిటని చూసిన వాళ్లంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

● కుక్కునూరు మండలంలో పట్టభద్రుల ఎన్నికల్లో బాగంగా 75శాతం ఓటింగ్ నమోదైంది. కుక్కునూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 272 ఓట్లు ఉండగా 204 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 130 మంది ఓటు హక్కు వినియోగించుకోగా స్త్రీలు 73మంది ఓటు వేశారు. సీఐ రమేష్‌బాబు, ఎస్సై రామకృష్ణ, తహసీల్దార్ రమేష్ బాబు పోలింగ్‌ను పర్యవేక్షించారు.

● వేలేరుపాడు మండలంలో 81.31 శాతం పోలింగ్ నమోదైంది. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 198 మంది ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి 161 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుష ఓటర్లు 110 మంది, మహిళా ఓటర్లు 51 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.


జంగారెడ్డిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

● జంగారెడ్డిగూడెం పట్టణంలో 4,658 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వీరిలో 3,060 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలో 65.69 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. పట్టణంలో జడ్పీ బాలుర హైస్కూల్లో నాలుగు, బాలికల హైస్కూల్లో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. జడ్పీ బాలికల హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు సి.హెచ్.శ్రీధర్‌తో పాటు ఆర్డీవో ఎం.వి.రమణ, డీఎస్పీ యు.రవిచంద్ర, తహసీల్దార్ కె.స్లీవజోజి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ కృష్ణకిషోర్, ఎస్సైలు ఎస్‌కె.జబీర్, శశాంక బందోబస్తు నిర్వహించారు.

● కొయ్యలగూడెం మండలంలో 69శాతం పోలింగ్ నమోదైంది. 1,606 ఓటర్లకు గానూ 1100 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పుచ్చకాయల విజయ్, నియోజకవర్గ పరిశీలకులు వెంకట నారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, నియోజకవర్గ జనసేన, బీజేపీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, మహిళా నాయకులు, పాల్గొన్నారు.

● లింగపాలెం మండల వ్యాప్తంగా 1596 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వారిలో 1241 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు సరళిని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పరిశీలించారు. ఆశించిన స్థాయిలో పోలింగ్ జరిగిందని కూటమి అభ్యర్థి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకన్న, తహసీల్దార్ ప్రసాద్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.


కుక్కునూరులో ఓటు వేసిన పట్టభద్రులు

● ద్వారకాతిరుమల మండలంలో 77.62 శాతం పోలింగ్ నమోదైంది. ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో రెండు, గుండుగొలను కుంట ఎంపీపీ పాఠశాలలో ఒకటి కలిసి మొత్తం మూడు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2163 ఓటర్లకు గాను 1679 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● పెదవేగి మండలంలో మొత్తం ఓటర్లు 2891 మంది ఉండగా, 2046 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 1226 మంది, మహిళలు 819మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పోలింగ్ జరిగే సరళిని పరిశీలించి, కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ ఆధిక్యంతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

● పెదపాడులో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో 1572 మంది ఓటు హక్కును పట్టభద్రులు వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 2,234 పట్టభద్రుల ఓటర్లు ఉండగా వీరిలో 932 మంది పురుషులు, 640 మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 70.37గా నమోదైంది.


కొయ్యలగూడెంలో బారులు తీరిన పట్టభద్రులు

● చింతలపూడి 3 వేల 87 ఓట్లకుగాను 2253 పోలయ్యాయి. ఓటింగ్ సరళిని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పోలింగ్ బూత్‌ల వారీగా పరిశీలించారు.

● కామవరపుకోట మండలంలో 75 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ గెడ్డం ఎలీషా తెలిపారు. 1257 మంది ఓటర్లకు గాను 940 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

● భీమడోలు మండలంలో మొత్తం 1611 ఓటర్లకు గాను 1177 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల పరిధిలో 73.06 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ నాయకురాలు మాలతీ రాణి పరిశీలించారు.

● బుట్టాయగూడెం మండలంలో 1036 మంది ఓటర్లు ఉండగా హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 746 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 408 మంది కాగా స్త్రీలు 338 మంది ఉన్నారని, 72 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ వివి చలపతిరావు తెలిపారు.

● జీలుగుమిల్లి మండలంలో ఎమ్మెల్సీ 70 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 473 ఓట్లకు 329 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 121 మహిళా ఓటర్లు, 208 మంది పురుషులున్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పోలింగ్ సరళిని పరిశీలించారు.



దెందులూరులో పోలింగ్ పరిశీలిస్తున్న ఆర్డీవో అంబరీష్, ఓటు వేసిన తవనా చౌదరి


పెదవేగిలో ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


భీమడోలులో ఓటు వేస్తున్న పట్టభద్రులు


కామవరపు కోటలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఘంటా మురళి


పెదవేగిలో భద్రత కల్పిస్తున్న పోలీసులు

విద్యార్థులకు సైన్సు దినోత్సవ పోటీలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వ హించాలని విద్యాశాఖ ఆదేశించింది. 'వికసిత భారత్ కోసం సైన్సు ఆవిష్కరణల్లో విశ్వ నాయకత్వానికి భారతీయ యువత సాధికారత' ప్రధాన అంశంగా వదస్సులు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. ఇందులో బాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా మండలస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో బాలబాలికలకు క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలను నిర్వహించామన్నారు.మండల స్థాయి విజేతలతో శుక్రవారం ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు.

2న దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 2న ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాల మైదానంలో నూతన దివ్యాంగ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. ఈ సెలక్షన్స్‌కు ఫిజికల్, డిజేబులిటీ, బ్లైండ్, వీల్ చైర్, డెఫ్ కేటగిరిలకు సంబంధించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారే కాకుండా నమోదు చేసుకోలేని దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనవచ్చని దివ్యాంగుల క్రికెట్ విభాగ కన్వీనర్ దానం వెంకట దుర్గారావు తెలిపారు. సమాచారానికి 90141 44440 నంబర్లలో సంప్రదించాలని సంఘ కార్యదర్శి వి.వి.ఎస్.ఎం.శ్రీనివాసరాజు తెలిపారు.

జిల్లా విద్యాశాఖ తీరుపై అపుస్మా అభ్యంతరం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ ఉపాధ్యాయ సంఘాలకు కొమ్ముకాసేలా జిల్లా విద్యాశాఖ తరచూ పాఠశాలలకు సెలవులు ప్రకటించడం పట్ల ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా)జిల్లా నాయకత్వం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేసింది. సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.ఆర్.కె.ఎ.ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు వేసేందుకు టీచర్లను పంపించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, టెన్త్ విద్యార్థుల విలువైన సమయాన్ని వృథా చేయడాన్ని జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఖండిస్తున్నాయని వివరించారు. పరీక్షల వేళ అన్ని కళాశాలలు యధాతథంగా పనిచేశాయని కేవలం పదో తరగతి విద్యార్థులను ఇబ్బందిపెట్టడం సబబుకాదని వివరించారు.

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.ఎమ్.బి బుచ్చిరాజు, యు.కూర్మారావు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పింఛన్‌దారులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినప్పటికీ పింఛన్‌దారులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు, గత ప్రభుత్వం తగ్గించిన యాడిక్వేట్ పెన్షన్ శాతాన్ని గత టీడీపీ ఇచ్చిన విధంగా పునరుద్ధరించాలని పెన్షనర్ల సంచాలకుల కార్యాలయం ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేశారు.

షాపుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : ఏలూరులో కారు యాక్సరీస్ అండ్ డెకరేషన్ షాపుల్లో పలు వస్తువులను ధరలు లేకుండానే ఇష్టానుసారంగా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి వి.శ్రీరామ్‌బాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఎస్ఐ సీతారామ్, తూనికలు కొలతల అధికారి ప్రశాంత్ కుమార్ తమ సిబ్బంది కలిసి ఏలూరు నగరంలో దాడులు నిర్వహించారు. పలు వస్తువులపై ధర, ఎలాంటి సమాచారం లేకుండా ఉన్న వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. ఏలూరులో మూడు షాపులను పరిశీలించి ఆరు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

తండ్రి జ్ఞాపకార్థం దహన పొయ్యి అందజేత

పెదవేగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన బలుసు పుల్లారావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు స్మశానవాటికలో దహన పొయ్యిని బహూకరించారు. కుమార్తెలు ఫణిరాజ్యలక్ష్మి, సత్యవాణి కలిసి తన తండ్రి జ్ఞాపకార్థం అంతిమ సంస్కార సమయంలో ఉపయోగపడేలా స్మశానవాటికలో దహన పొయ్యిని రూ.1.40 లక్షలతో చేయించి అందజేశారు. మృత దేహాలను దహనం చేయడానికి ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలిపారు.

భువనపల్లిలో సినిమా షూటింగ్

నిడమర్రు ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): భువనపల్లిలో సినిమా షూటింగ్ యూనిట్ సందడి చేసింది. భువనపల్లి గ్రామపెద్దలు లయన్ ఈపూరి సత్యనారాయణ స్వగృహం ప్రియాంకా మెన్షన్‌లో స్ప్రింట్ మీడియా మేకర్స్ అనగనగా ఓ రాజు సినిమా షూటింగ్ ఉదయం నుంచి నిర్విరామంగా సాగింది. దీనిలో హీరోగా నవీన్ పోలిశెట్టి, హీరోయిన్ పెరియా అబ్దుల్, మీనాక్షీ చౌదరిలు నటించారు. ఈ సినిమాకు నిర్మాత ఎస్.నాగవంశీ వ్యవహరిస్తున్నారు. షూటింగ్‌లో హీరో నవీన్ పొలిశెట్టి, హీరోయిన్ పెరియా అబ్దుల్, కామెడీ ఆర్టిస్టులు చమ్మక్ చంద్ర, మహేష్, కాదంబరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. తొలిసారి భువనపల్లిలో సినిమా షూటింగ్ జరగడంతో స్థానికులు అధిక సంఖ్యలో షూటింగ్ చూడటానికి విచ్చేశారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న బొలెరో ట్రక్కు ఆటో టైర్ పేలి మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఓ వ్యక్తి గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన రెడ్డి శ్రీనివాసరావు (47)కు బొలెరో ట్రక్కు ఆటో ఉంది. అతను ఉంగుటూరు మండలం నారాయణపురం వద్ద ఉన్న టైల్స్ ఫ్యాక్టరీ నుంచి టైల్స్‌ను తీసుకెళ్లి తన ప్రాంతంలో విక్రయిస్తుంటాడు. ఈ నెల 20న అతను, అతని భార్య పద్మావతి కలిసి వచ్చి తమ ట్రక్కు ఆటోలో వేసుకెళ్తున్నారు. 16వ నెంబర్ జాతీయ రహదారి ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ దగ్గర టైర్‌పేలి మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలకు గాయాలయ్యాయి. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అనంతరం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ జీవరత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపుపై నిఘా

ఇద్దరిపై కేసు నమోదు


భీమడోలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : కోళ్ల ఫారాల్లో మృతి చెందిన కోళ్లను, వాటి వ్యర్థాలను చేపల చెరువులకు రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన భలే సత్యనారాయణ, మరో ఇద్దరు ఈ నెల 20న కోళ్ల ఫారాల్లో మృతి చెందిన కోళ్లు, వాటి వ్యర్థాలను చేపల చెరువులకు తరలించగా అందిన సమాచారం మేరకు నిఘా పెట్టి తెల్లవారు జామున పట్టుకున్నారు. అశోక్ లైలాండ్ బడా వాహనంలో ఈ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీన పర్చుకుని అంబర్‌పేట శివారులో వాటిని పాతిపెట్టినట్టు పోలీసులు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో సోమయ్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ వద్ద పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు తరఫున ఓటర్లకు సహాయం చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్యను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతనిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధంలో ఉంచారు. ఆయన ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు అందడంతో అదుపులోకి తీసుకుని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విలీన సభను జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో మార్చి 2న జరగనున్న (భారత కార్మిక సంఘాల సమాఖ్య) ఐ.ఎఫ్.టి.యు.(ఇఫ్టూ) సంఘాల విలీన సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కోశాధికారి కె.వి.రమణ పిలుపునిచ్చారు. గురువారం కె.ఆర్.పురంలో జరిగిన కార్యక్రమంలో విలీన సభ గోడ ప్రతులను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులు అభద్రతా భావంతో జీవిస్తున్నారని అన్నారు. రెండు విప్లవ కార్మిక సంఘాలు ఒకటి కావడం వలన కార్మిక ఉద్యమాలను మరింతగా ఉధృతం చేయడానికి ఉపయోగపడుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజేష్, కె.కిషోర్, పి.అనిల్, ఎం.నాగేంద్ర, కె.రవివర్మ, డి.రాజు, ఎం.రాజ్‌కుమార్, కె.చందు, తదితరులు పాల్గొన్నారు.


ఒకే వేదికపై దేవతామూర్తుల వివాహ వేడుక

ముగిసిన నృశింహ యజ్ఞం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సుందరగిరి నృశింహక్షేత్రంలో శ్రీమహాసుదర్శన నృశింహయజ్ఞం ముగిసింది. ఒకే వేదికపై ముగ్గురు దేవతామూర్తులకు దేవేరులతో గురువారం శాంతికల్యాణం నిర్వహించారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి, శివపార్వతులకు, లక్ష్మీనారాయణులకు కల్యాణాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కుక్కునూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని శ్రీఅన్నపూర్ణ సమేత కేదా రేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో లింగోద్భవంలో బాగంగా రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. 1500మందికి అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు నవీన్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు లింగేశ్వరునికి పవళింపు సేవ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపేట కాలువ గట్టు వద్ద ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత రేపు లింగేశ్వరస్వామి ఆలయం 11వ వార్షికోత్సవంలో బాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పవళింపు సేవను ఆలయ యాజ్ఞీక బ్రహ్మ వీరుభొట్ల కృష్ణశర్మ, అర్చకులు వీరుభొట్ల వెంకటేశ్వరరావు శర్మలు నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామికి, అమ్మవార్లకు శాంతి కళ్యాణ మహోత్సవం జరిపి లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.గురువారం స్వామి, అమ్మవార్లకు తులసీ దళ పూజలు నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో సాయి ప్రతిభ



నిడమర్రు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నిడమర్రు మండలం ఛానమిల్లి గ్రామానికి చెందిన విద్యార్థి బేతు యశ్వంత్ సాయి ఆలిండియా లెవెల్లో జరిగిన జేఈఈ-25 మెయిన్స్ ఫలితాల్లో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో విజయదుందుభి మోగించాడు. బేతు సూరిబాబు - నాగలక్ష్మీ దంపతుల పెద్ద కుమారుడు బేతు యశ్వంత్ సాయి ఇంటర్ విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్ -25 ఫలితాల్లో ఆలిండియా లెవెల్లో మొదటి స్థానం సాధించాడు. ఆలిండియా లెవెల్లో ఓపెన్ కేటగిరిలో 13 వస్థానం, ఏపీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఓ తాపీమేస్త్రి కుటుంబానికి చెందిన సాయి ఈ ఘనతను సాధించడం పట్ల గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శేషగిరిరావు, నిడమర్రు యంఈవో భాస్కర్ కుమార్, శ్రీనివాసరావులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

'హెచ్ఎం సస్పెన్షన్ సరికాదు'

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి) : కొందరు టీచర్ల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలే జంగారెడ్డిగూడెం మండలం, లక్కవరం (రెడ్డిపేట)ఎంపీపీ స్కూల్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం సస్పెన్షన్‌కు కారణమని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, సి.హెచ్.ధర్మలింగం పేర్కొన్నారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో హెచ్ఎం సస్పెన్షన్‌కు అన్యమత ప్రచారం కారణం కాదని, కేవలం టీచర్ల మధ్య నెలకొన్న కులవివక్షే కారణమన్నారు.

నేత్ర పర్వంగా నందివాహన సేవ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రావణబ్రహ్మ వాహనంపై గంగా పార్వతీ సమేతంగా కొలువుతీరిన శివయ్య గురువారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. శివదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు క్షేత్ర పాలకుని ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం వేదపారాయణలు, శివదేవునికి ప్రత్యేక అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. రాత్రి గంగాపార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులను అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై ఉంచి పుష్పాలంకరణ చేశారు. ఈ నేపథ్యంలో చినవెంకన్న ఆలయాన్ని సినీ నటులు షఫీ, మాణిక్ రెడ్డిలు దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయంలో వారిని గుర్తించిన కొటి భక్తులు వారితో, సెల్ఫీలు పోటోలు దిగారు.

మూడు మండలాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్/దెందులూరు/టి.నరసాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : ఏలూరు అశోక్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయను న్నారు. అశోక్ నగర్ స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు గుళ్ల సెంటర్ మోతేవారి తోట, అతిథిహోటల్, శంకరమటం, సుబ్బమ్మదేవి స్కూల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారి కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సెక్షన్ పరిధిలో కొమడవోలు, హమాలీ కాలనీ, దుర్గాగ్రాండ్ సిటీ, అండాలమ్మతోట, రామ్‌నగర్, మారుతీ నగర్, మస్తాన్‌మన్యం కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● దెందులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ మరమ్మతులు చేయడానికి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. రామారావుగూడెం, పెరుగుగూడెం, మలకచర్ల, ధర్మారావుపేట గ్రామాలకు సరఫరా నిలిచిపోనుందని తెలిపారు.

● టి.నరసాపురం మండలంలోని బండి వారిగూడెం, రాజుపోతే పల్లి సబ్ స్టేషన్లలో వార్షిక మరమ్మతుల్లో బా గంగా చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫ రా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ కోరారు.

వట్లూరు కాజ్‌వేను పునరుద్ధరించండి

పెదపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : పెదపాడు - వట్లూరు కాజువే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తలెత్తిన వరద ఉధృతికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెదపాడు నుంచి వట్లూరు, కలపర్రు, సత్రంపాడు, ఏలూరు వెళ్లేందుకు ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రం పెదపాడు వచ్చేందుకు ఇది దగ్గర మార్గం. అలాగే నిత్యం వందలాది మంది రైతులు ఈ మార్గం నుంచే వ్యవసాయ పనులకు రాకపోకలు సాగిస్తుంటారు. పశుగ్రాసం, ధాన్యం రవాణాకు ఇదే ప్రధాన రహదారి. ఇంతటి ప్రధానమైన రహదారి గత వరదల కారణంగా కొట్టుకుపోయింది. పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో ఈ కాజువే పైనుంచి ప్రయాణానికి ఏ క్షణంలో కుంగిపోతుందోనని భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని కాజువేను తిరిగి పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు.


కుంగిన కల్వర్టు


చాట్రాయి పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు


కలిదిండి, ఆగిరిపల్లి, నూజివీడు బాలికోన్నత పాఠశాలలో క్యూలో వేచిఉన్న ఓటర్లు, చాట్రాయిలో ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

పోలింగ్ ప్రశాంతం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు

కైకలూరు 83 శాతం

కైకలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కైకలూరు మండలంలో 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 2296 ఓట్లకు 1664 ఓట్లు పోలయ్యాయి. 72.47 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కైకలూరు స్కూల్లో ఓటు వేశారు.

కలిదిండి 83 శాతం

కలిదిండి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 83 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1633 ఓట్లకు 1359 ఓట్లు నమోదయ్యాయి. కలిదిండిలో 16, 17 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలైన్లలో బారులుతీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. కైకలూరు సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

మండవల్లిలో 76.8 శాతం

మండవల్లి: మండవల్లి జడ్పీ హైస్కూలు వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 1122 మంది పట్టభద్రులు ఉండగా 862 (76.8 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై రామచంద్రరావు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైస్కూలులో జరుగుతున్న పోలింగ్ సరళిని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పరిశీలించారు.

ముదినేపల్లిలో 77.50 శాతం

ముదినేపల్లి: స్థానిక జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన 2 పోలింగ్ కేంద్రాల్లో 77.50 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 1396 ఓట్లకు 1082 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ అనంతరం ఊపందుకుంది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, బొర్రా చలమయ్య, స్వతంత్ర అభ్యర్థి తిరివీధుల శారద ముదినేపల్లిలో ఓటును వినియోగించుకున్నారు. తహసీల్దార్ సుభానీ పోలింగ్‌ను పర్యవేక్షించగా, సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వీఎస్.వీరభద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నూజివీడు పట్టణం 69, మండలంలో 74 శాతం

నూజివీడు : కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నూజివీడులో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో 12 పోలింగ్ బూత్‌లలో మొత్తం 9,632మంది ఓటర్లకు 6852 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. నూజివీడులోని ఎస్ఆర్ఆర్ బాలుర పాఠశాలలో 4 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 3,338 ఓటర్లకు 2,305 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 69 శాతం పోలింగ్ నమోదైంది. రూరల్ మండల పరిధికి నూజివీడు బాలికోన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 1777ఓట్లకు గాను 1327 ఓట్లు పోలై దాదాపు 74శాతం ఓటింగ్ నమోదైంది.

చాట్రాయి మండలంలో 68 శాతం

చాట్రాయి: మండలంలో పట్టభద్రుల పోలింగ్ 68 శాతం నమోదైంది. మొత్తం 1,553 మంది ఓటర్లకు 1,058 మంది 68 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. చనుబండలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లిరావడానికి టీడీపీ నాయకుడు నక్కా రాము ఆటోలు ఏర్పాటు చేశారు. ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై గజపతిరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆగిరిపల్లి మండలంలో 71.93 శాతం

ఆగిరిపల్లి : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 1186 మంది ఓటు వినియోగించుకున్నారు. 71.93 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ పీఎస్‌వీప్రసాద్ తెలిపారు. రూరల్ సీఐ కె.రామకృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ శుభశేఖర్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ముసునూరులో 72 శాతం

ముసునూరు: ముసునూరు జడ్పీపాఠశాలలో ఉన్న రెండు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో 72శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలి పారు. ఎన్నికల ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 1343 మంది ఓటర్లకు గాను 966 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నూజివీడు డీఎస్పీ పర్యవేక్షణలో ఎస్ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. మంత్రి కొలుసు పార్థసారథి పోలింగ్ సరళిని పరిశీలించారు.

స్వతంత్ర అభ్యర్థిపై నియమావళి ఉల్లంఘన కేసు

ముదినేపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన స్వతంత్ర అభ్యర్థి తిరువీధుల శారదపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీఎస్.వీరభద్రరావు తెలిపారు. పోలింగ్ జరుగుతున్న జడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రచారం చేయడమే కాక, మీడియా సమావేశాన్ని కూడా నిర్వహించినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన శారదపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి మండల కమిటీ ఇన్‌చార్జి వై.రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్ల ఎస్ఐ తెలిపారు.

దూర ప్రాంతాల పట్టభద్రులు రాలేదు

ముదినేపల్లి మండలంలో స్థానికంగా ఉంటున్న పట్టభద్రులు మాత్రమే ఓటు వేశారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు పోలింగ్‌లో పాల్గొనలేదు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్, ఇతర రంగాల్లో స్థిరపడిన అతి తక్కువ మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

నూతనోత్సాహం

ముదినేపల్లి మండలంలో అధిక శాతం యువత ఓటు వేశారు. మండలంలో సుమారు 300 మందికిపైగా కొత్తగా ఓటు పొందిన వారున్నారు. తొలిసారి ఓటు హక్కు పొందిన వారు 90 శాతం మంది ఓటేసినట్లు అంచనా. కోడూరు గ్రామానికి చెందిన మొగడ సునీత, పెందుర్తి మీనా పోలింగ్ కేంద్రంలో ఓటేసిన అనంతరం వేళ్ల చూపిస్తూ తొలి సారిగా ఓటు వేయటం చాలా ఆనందంగా ఉందన్నారు.


కైకలూరు, మండవల్లిలో ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు, ముసునూరులో పోలింగ్ పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్, ముదినేపల్లిలో చంటి బిడ్డతో ఓటేసిన తల్లి, గర్భిణి, కొత్త ఓటర్లు


కొల్లేటికోట శ్రీపెద్దింటమ్మ ఆలయం

రేపటి నుంచి పెద్దింటమ్మ జాతర

» కొల్లేటికోటలో సందడి

కైకలూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట పెద్దింటమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. మార్చి ఒకటో తేదీ నుంచి 13 వరకు జరుగుతాయి. 10న జలదుర్గమ్మకు గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామికి కల్యాణ మహోత్సవం జరిపిస్తారు. చివరిరోజు 13న ఆలయ కోనేరులో తెప్పోత్సవం జరుపుతారు. జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, మంచినీరు, చలువపందిర్లు,విద్యుద్దీపాలంకరణ, వైద్య శిబిరాలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

పెద్దింట్లమ్మను ఇక్కడ మత్స్యకారులు కుల దైవంగా కొలుస్తారు. వీరంతా పూర్వం ఒడిశా ప్రాంతం నుంచి వలస వచ్చి కొల్లేరు సరస్సు చుట్టూ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఇక్కడ వడ్డెర కులస్థులే కాకుండా అసోం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

కనుల పండువగా రామేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ముసునూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బలివే శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండవగా నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తీసుకువచ్చి బుధవారం రాత్రి 11.30 గంటలకు వేదమంత్రోచ్ఛరణతో కల్యాణం నిర్వహించారు. అనంతరం తాతగుడికి ఊరేగింపుగా వెళ్లి స్వామివారు ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు క్యూలైన్‌లో వేచిఉండి స్వామివారిని దర్శించుకున్నారు. బాహ్య శివలింగం వద్ద భక్తులు పూజలు చేశారు. స్వామివారికి ఉదయం బిందె తీర్థం, హోమం, బలిహరణ, సాయంత్రం హోమం, బలిహరణనాథులు, మహాకుంభం, నారకోలోత్సవం తోపాటు రాత్రి 10గంటల నుంచి పురవీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ ఎం.చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి తదితరులు పాల్గొన్నారు.

పెదలంకలో రథోత్సవం

కలిదిండి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శివరాత్రి మహోత్సవాలు సందర్భంగా పెదలంకలో పార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. వసంతోత్సవం, త్రిశూల స్నానం నిర్వహించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ అయినాల బ్రహ్మాజీరావు, ఆలయ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ, అర్చకుడు మామిళ్లపల్లి నాగేంద్ర శర్మ, ఈవో శేఖర్ పాల్గొన్నారు.


పెదలంకలో రథోత్సవం

రాష్ట్ర బడ్జెట్‌లో కొల్లేరు పర్యాటకాభివృద్ధిపై దృష్టి

కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కైకలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శుక్రవారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ప్రాధాన్యాంశాలపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం మాట్లాడారు. సాగు, తాగునీరు సరఫరాకు వేసవిలోని పంటకాలువుల, మురుగు కాలువల అభివృద్ధికి, ఆక్వారంగానికి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని భావిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశామని, అవకాశాన్ని బట్టి పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు మేలు జరిగేలా చూస్తానన్నారు.

చెరువులో కూరుకుపోయిన మృతదేహాలు లభ్యం



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి) : చెరువులోని ఊబిలో మునిగి పోయిన బాబాయి, అబ్బాయి మృతదేహాలు గురువారం ఉదయం తేల డంతో రెస్క్యూటీమ్ వాటిని బయటకు తీశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన జజ్జువరపు వెంకటేశ్వరరావు (50) ఈనెల 26న సాయంత్రం ఆ గ్రామంలోని చెరువులో స్నానం చేయడానికి దిగగా ఊబిలో కూరుకుపోతూ కేకలు వేయడంతో అతని తమ్ముడి కుమారుడు సుబ్రహ్మణ్యం (30) కాపాడేం దుకు నీటిలో దిగాడు. ఇతను కూడా ఊబిలో కూరుకుపోతూ కేకలు వేశాడు. గట్టుపై ఉన్నవారు భయంతో కాపాడలేకపోయారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బుధవారం సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా మృతదేహాలు లభ్యం కాలేదు. గురువారం ఉదయం రెండు మృతదేహాలు నీటిలో తేలడంతో రెస్క్యూ టీమ్ బయటకు తీసుకువచ్చారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తర లించి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): డయాలసిస్ బాధను తట్టుకోలేని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని తిరుమలంపాలెంకు చెందిన భీమడోలు నాగేశ్వరరావు (62) ఏడాదికాలంగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించు కుంటున్నాడు. డయా లసిస్‌ను తట్టుకోలేక ఈనెల 25న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి విజయవాడ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

బలివే తమ్మిలేరు స్నానఘట్టంలో యువకుడి మృతి


సంఘటనా స్థలిలో మృతదేహం (ఇన్‌సెట్) రాంబాబు (ఫైల్)

ముసునూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి స్నానఘట్టం దగ్గర ఇద్దరు అన్నదమ్ములు మృతిచెందిన విషయం మరువక ముందే గురువారం మరొకరు మృతి చెందారు. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంకు చెందిన హెచ్చు రాంబాబు(28) స్వామివారి దర్శనం అనంతరం సాయంత్రం తమ్మిలేరులో స్నానానికి దిగి నీటిలో మునిగిపోయాడు. స్థానికులు స్పందించి అతడికి వెలికి తీయగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మృతి చెందిన రాంబాబు భార్య, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం అతడి భార్య ఏడు నెలల గర్భిణి. అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భక్తులు, మృతుడి బంధువులు ఆరోపించారు. తమ్మిలేరులో ప్రమాదాలు జరుగకుండా రక్షణగా కర్రలను ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారని పలువురు మండి పడుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తిచేశారు. మార్చి 1 నుంచి 15 వరకూ జరుగనున్న ఈ పరీక్షల్లో 318 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 197 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 121 మంది పరీక్షల కు హాజరు కానున్నారు. పరీక్షలకు కళాశాలలో 7 రూములను ఏర్పాటు చేశారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణ మూర్తి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా కలిదిండి జూనియర్ కళాశాల లెక్చరర్ జి.సుధాకర్ వ్యవహరిస్తున్నారు. పరీక్షల నిర్వహణకు 10 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.


ఉత్సవాలకు ముస్తాబైన మేరీ మాత చర్చి

రేపటి నుంచి మేరీ మాత ఉత్సవాలు

కలిదిండి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మేరీమాత ఉత్సవాలను మార్చి 1 నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తామని విచారణ కర్త బంటుమిల్లి యోహాను తెలిపారు. మార్చి 1న సమష్టి దివ్యపూజబలి సమర్పణ, జపమాల, మేరీమాత ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 2న సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రార్థనలు 3న జపమాల తదితర పూజలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర నలుమూ లల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని సర్పంచ్ మారుతి ప్రసన్న తెలిపారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహిస్తామని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు




అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ట్రిపుల్ ఐటీలో ఆటోడెస్క్‌పై వర్క్‌షాపు


వర్క్‌షాపులో మాట్లాడుతున్న లీలాకృష్ణ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో గురువారం ఆటోడెస్క్ ఇన్‌వెంటరీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఉగ్యాన్ ఎడ్యుకేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ లీలాకృష్ణ మాట్లాడుతూ టూల్స్, మెషీన్ డ్రాయింగ్ తదితరాలపై ప్రత్యక్ష అనుభవాన్ని సాధించాలన్నారు. మెకానికల్ విభాగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులకు పలు ప్రాక్టికల్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగం హెచ్‌వోడీ యు.పావని, వర్క్‌షాపు కోఆర్డినేటర్ షేక్ అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.


బాలా త్రిపురసుందరి సమేత ముక్తేశ్వరస్వామి కల్యాణం

కనుల పండువగా శివ కల్యాణం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వరాహ పుష్కరిణి సమీపంలో బాలాత్రిపుర సుందరి సమేత ముక్తేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం యజ్ఞాకుడు లోక కార్తికేయ శర్మ రుద్రహోమం, పూజలు చేశారు. రాత్రి శివకల్యాణం జరిపించారు. ఈ కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. గురువారం ఆలయ వద్ద అన్నదానం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు స్వీకరించారు.


ఉమారామలింగేశ్వరుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, కమిటీ సభ్యులు

చాట్రాయిలో ఉమారామలింగేశ్వరుల ఊరేగింపు

చాట్రాయి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో గురువారం సాయంత్రం ఉమారామలింగేశ్వరుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం జరగ్గా కల్యాణమూర్తులను మంగళ వాయిద్యాలు, కోలాటాలతో ఊరేగించారు. భక్తులు ఉమారామలింగేశ్వరులకు పూజలు చేశారు.

తుమ్మగూడెం శివాలయంలో మంత్రి పూజలు

తుమ్మగూడెంలోని జ్ఞానాంబికా సహిత త్రయంబకేశ్వరస్వామిని మంత్రి కొలుసు పార్థసారథి గురువారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు మంత్రికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు.


చిన్నారి తండ్రికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి పార్థసారథి

చిన్నారి వైద్యానికి రూ.4 లక్షలు

చాట్రాయి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన 4 ఏళ్ల పొదిలి కిరణ్‌కుమార్‌కు మెరుగైన వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ 4 లక్షల చెక్కును మంత్రి పార్థసారథి గురువారం చిన్నారి తండ్రి చెన్నారావుకు అందజేశారు. కిరణ్‌కుమార్‌కు మెదడులో రక్తం గడ్డకట్టి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సహాయం అందించాలని మంత్రి పార్థసారథిని టీడీపీ నాయకుడు మిద్దే సత్యనారాయణ కలిసి విజ్ఞప్తి చేయడంతో స్పందించిన మంత్రి రూ 4 లక్షలు మంజూరు చేయించారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న నూజివీడు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు

భారీగా మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మీర్జాపురంలో అనధికారిక మద్యం విక్రయాలపై పోలీసులు దాడులు చేశారు. రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మీర్జాపురంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని 227 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా అక్రమ మద్యం కలిగి ఉన్నట్లు సమాచారం తెలిస్తే 9440796440 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.